సమీక్ష సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ ప్రత్యేకపాలన అధికారి, మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ ఫాల్గున్ కుమార్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను, పారిశుద్ధ్యం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ నూతన కళ్యాణ మండపాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తదితరులున్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో బీజేపీ శ్రేణులు భారత ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జగన్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లుతో సామాన్య ప్రజలకు ఉద్యోగస్తులకు మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు నర్సింగరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

జిన్నారం (పటాన్‌చెరు): పాఠశాలల అభివృద్ధికి హెట్రో పరిశ్రమ యాజమాన్యం అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని గుమ్మడిదల మండల విద్యాధికారి రాంబాబు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు హెట్రో సౌజన్యంతో బహుమతులను అందజేశారు.

గీతం నూతన వీసీగా ఎర్రోల్ డిసౌజా

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ)గా ప్రముఖ విద్యావేత్త, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎర్రోల్ డిసౌజా నియమితులయ్యారు. గీతం అధ్యక్షుడు భరత్ బుధవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన టౌన్ హాల్ సమావేశంలో విషయాన్ని సిబ్బందికి వెల్లడించి, నూతన వీసీని అందరికీ పరిచయం చేశారు. డాక్టర్ డిసౌజా నియామకంపై గీతం అధ్యక్షుడు భరత్ హర్షం వ్యక్తం చేశారు.

వర్సిటీకి ఉత్తమ ర్యాంకు తీసుకురావాలి

వీసీ అల్దాస్ జానయ్య

ఏజీవర్సిటీ: ప్రతిభ, సమర్థనీయత, అనుభవాల ఆధారంగా ఏజీ వర్సిటీకి మంచి ర్యాంకు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి అల్దాస్ జనాయ్య తెలిపారు. విశ్వవిద్యాలయంలో ఇటీవల పదోన్నతులు పొందిన అధికారులు, నూతనంగా వచ్చిన అధికారులతో పరిచయ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విశ్వవిద్యాలయ అధికారుల నియామకాన్ని ఎటువంటి ఒత్తిళ్ల ప్రలోభాలు లేకుండా పూర్తి చేసినట్లు వివరించారు. భవిష్యత్‌లో దేశంలోని అత్యుత్తమ వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పీజేటీఏఎస్‌ను ప్రతమ స్థానంలో నిలిపేందుకు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రైతాంగ సంక్షేమమే పరమావధిగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఉపకులపతి సూచనలు, సలహాలతో విశ్వవిద్యాలయ స్థాయిని మరింత పెంచేందుకు కృషి చేస్తామని పదోన్నతి పొందిన అధికారులు సూచించారు.

ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు

శంషాబాద్: ఉమ్రా యాత్రకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి బుధవారం సాయంత్రం తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన యాత్రికులు బయలుదేరారు. అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకుడు ఫయాజ్ అలీ పర్యవేక్షణలో వారంతా 15 రోజుల యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవం

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోటలోని శ్రీ విఘ్నేశ్వర, నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వర దత్తాత్రేయ నవగ్రహ అభయాంజనేయ ఉమామహేశ్వర ఆలయంలో గురువారం నుంచి 8వ తేదీ వరకు ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. అవంతినగర్ తోట రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం గణపతి పూజ, స్వస్తి పుణ్యావచనం, పంచగవ్య ప్రాశనం, రక్షాబంధనం, భిక్షాధారణం, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, అఖండ దీపస్థాపన, వాస్తు నవగ్రహ క్షేత్ర పాలక యోగిని సహిత సర్వతో భద్ర మండల ఆహ్వాన కలశ స్థాపన, వాస్తు హోమం, అగ్ని ప్రతిష్ఠతో ఈ పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విజృంభిస్తున్న దోమలు

కొరవడుతున్న నివారణ చర్యలు



చందానగర్ సర్కిల్‌లో ఫాగింగ్ చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

- కానరాని ఎంటమాలజీ సిబ్బంది
- నిలిచిపోయిన ఫాగింగ్‌తో దోమల బెడద తీవ్రం
- రోగాలతో అవస్థలు పడుతున్న ప్రజలు

చందానగర్: జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్–21 పరిధిలో రోజురోజుకూ దోమల బెడద అధికం అవుతోంది. దోమల నివారణ కోసం నిత్యం ఫాగింగ్ చేయాల్సిన ఎంటమాలజీ సిబ్బంది బస్తీలు, కాలనీల్లో కనిపించడం లేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

- ఎంటమాలజీ సిబ్బంది తీరు, ఫాగింగ్ విషయంలో నెలకొన్న నిర్లక్ష్యంపై ప్రజావాణిలో కూడా పలు మార్లు ఫిర్యాదు చేశారు. అయితే సిబ్బంది కొరత ఉందని, త్వరలోనే పరిష్కరిస్తామని ఉన్నతాధికారులు దాటవేస్తున్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలో ఒక అసిస్టెంట్ ఇంజినీర్ ఎంటమాలజిస్ట్‌తో పాటు 70 మంది ఉండాలి. కానీ సగం మందికి పైగా సిబ్బంది లేకపోవడంతో ఫాగింగ్ పనులు కాస్తా నిలిచిపోయాయి.
- ఇటీవల శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ఎంటమాలజీ సిబ్బందిని ఉన్నతాధికారులు డీజిల్, పెట్రోల్ దొంగతనం చేస్తున్నారనే కారణంతో జోనల్ స్థాయి ఎంటమాలజిస్ట్‌లతో పాటు జంట సర్కిళ్లలో పనిచేసే సహాయ ఎంటమాలజిస్ట్‌లను విధుల నుంచి తొలగించారు. దీంతో సిబ్బంది కొరత మరింత తీవ్రంగా మారింది. దీనిపై ఇప్పటి వరకు ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- దాదాపు రెండు నెలలుగా కాలనీలు, బస్తీలలో గేటెడ్ కమ్యూనిటీలలో ఫాగింగ్ నిలిచిపోయింది. అడపాదడపాగా ఒకరు, ఇద్దరు సిబ్బందితో సర్కిల్–21 పరిధి మొత్తం ఫాగింగ్ చేయిస్తున్నారు. ఫాగింగ్ యంత్రాలు నడవడానికి పెట్రోల్, డీజిల్ అవసరం ఉంది. అధికారులు ప్రైవేట్ పెట్రోల్ బంకుల నుంచి తీసుకొస్తున్నారు. అయితే దానికి సంబంధించిన బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతోంది. దీంతో పెట్రోల్ బంకుల యాజమాన్యాలు పెట్రోల్ సరఫరాను ఆపివేశారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఎంటమాలజీ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించి దోమల నివారణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- చందానగర్ సర్కిల్ పరిధిలో శాంతినగర్, న్యూహఫీజ్‌పేట్, వేముకుంట, ఇందిరానగర్, యూత్‌కాలనీ, సాయి కాలనీ తదితర బస్తీలలో దోమల బెడద ఎక్కువ ఉంటుంది.
- దోమల స్వైర విహారంతో ప్రజలు మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర వ్యాధుల బారిన పడుతున్నారు.
- ఒక్కో కాలనీకి వారం రోజులకు ఒక సారి ఫాగింగ్ చేయాలి. సిబ్బంది కొరతతో 10 రోజులకు ఒకసారి ఫాగింగ్ చేస్తున్నారు.

త్వరలో సిబ్బందిని నియమిస్తాం

చందానగర్ సర్కిల్ పరిధిలో ఎంటమాలజీ సిబ్బంది కొరత ఉంది వాస్తవమే. త్వరలోనే పూర్తి స్థాయి సిబ్బంది నియమించి కాలనీలు, బస్తీలలో ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయిస్తాం. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు రూపొందిస్తున్నాం. – డాక్టర్ విజయ్, ఏఎంహెచ్ఓ

ప్రబలుతున్న విష జ్వరాలు



చందానగర్ సర్కిల్–21 పరిధిలో 15 రోజులుగా ఎంటమాలజీ సిబ్బంది రాక ఫాగింగ్ చేయక దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీని వలన ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. దోమలతో నిద్రకూడా లేకుండా పోతోంది. ఇకనైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు దోమల బెడదను నియంత్రించాలి.

– ఎస్.ఎస్.రెడ్డి, శివాజీనగర్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



చందానగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్ కాలనీ, వార్డు కార్యాలయం, గ్రీన్ బావర్చి ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- ఆదిత్యానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆదిత్యానగర్, ఎస్‌సీబీ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.
- వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని సురక్షా ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యానగర్, సురక్షా ఎన్‌క్లేవ్, సురక్షా హిల్స్, శుభోదయ కాలనీ, పద్మజ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, అపర్ణ హెచ్‌టీ సర్వీస్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.
- చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆదిత్యా ఇంపీరియల్ హైట్స్, మార్తాండనగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆదిత్యా ఇంపీరియల్ హైట్స్, మార్తాండనగర్ పూర్తి ఏరియాలలో విద్యుత్ ఉండదని ఏఈ దీప్తి తెలిపారు.

డైమండ్ హిల్స్ ఫీడర్ పరిధిలో..

శేరిలింగంపల్లి: 11కేవీ డైమండ్ హిల్స్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట నారాయణ రెడ్డి తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోపన్‌పల్లి తండా, డైమండ్ హైట్స్, జవహర్ నవోదయ స్కూల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

కేన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కోవాలి

కిమ్స్ ఆంకాలజీ వైద్యులు

గచ్చిబౌలి: కేన్సర్ వచ్చిందని భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొంటే వైద్యులు, కుటుంబం మద్దతులో కోలుకోవచ్చని కొండాపూర్ కిమ్స్ ఆంకాలజీ వైద్యులు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ హర్ష తాళ్లూరి, డాక్టర్ రమ్య పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్ కిమ్స్‌లో అంతర్జాతీయ కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేన్సర్‌తో పోరాడి విజయం సాధించిన రోగులు పాల్గొన్నారు. కేన్సర్ అనగానే ప్రాణాంతక వ్యాధి సోకిందని రోగులు మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారని వైద్యులు తెలిపారు. కేన్సర్లలో అనేక రకాలైన కేన్సరులు ఉన్నాయని, రోగి మానసికంగా దృఢంగా ఉంటే ఎంతటి వ్యాధికైనా చికిత్స చేయవచ్చన్నారు. మారుతున్న జీవనశైలి కారణంగా అనేక రాకాలైన వ్యాధులతో పాటు కేన్సర్ వస్తుందని అన్నారు. ఆధునిక వైద్య పద్ధతులు, సాంకేతికతతో ముందస్తుగా కేన్సర్ గుర్తిస్తే తగిన చికిత్స అందుబాటులో ఉందన్నారు.



కేన్సర్‌ను జయించిన వారితో వైద్యులు

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు



శంషాబాద్ డీసీపీ రాజేష్‌కు ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సేవాసమితి సభ్యులు

శంషాబాద్: రెడ్డి కులస్తులపై తరచూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శంషాబాద్ రెడ్డి సేవా సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం శంషాబాద్ డీసీపీ రాజేష్‌కు ఫిర్యాదు చేశారు. రెడ్డి కులస్తుల మనోభావాలను కించపర్చేలా తీన్మార్ మల్లన్న వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం డీసీపీ కార్యాలయం ప్రాంగణంలో వారు మీడియాతో మాట్లాడారు. తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ బహిష్కరించాలని డిమాండ్ చేశారు. తీన్మాన్ మల్లన్న తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలవాలన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి కులాల మధ్య చిచ్చు రేపుతున్న అతడిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రెడ్డి సేవాసమితి అధ్యక్షుడు మునగాల సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, కోశాధికారి జనార్ధన్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు బుచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, సంతోష్‌రెడ్డి, నారాయణరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జయేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో...

మణికొండ: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై మణికొండ రెడ్డి ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు బుధవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తీన్మార్ మల్లన్న మాటలు, చేష్టలు రెడ్ల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. సభ్యులు నరేందర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామలింగారెడ్డి, శివారెడ్డి, బాలవెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి, శరత్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కిషన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, రాఘవరెడ్డి, కృపాకర్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి, రామిరెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సాకేత్‌రెడ్డి, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 30 రోజుల శిక్షణను ఈ నెల 7 నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ట్రస్టు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గురుకులాన్ని సందర్శించిన అధికారులు

మణికొండ: నార్సింగిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను బుధవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శోభ, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ పూనమ్, పీహెచ్స్ వైద్యాధికారి సత్యరత్న సందర్శించారు. ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా వంట గది, భోజన శాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ సుజాత, హెల్త్ ఎక్స్టెన్షనల్ ఆఫీసర్ శ్రీధర్, సూపర్‌వైజర్ లక్ష్మి, ఏఎంఎం తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చివేత

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలోని రాళ్లగూడ సమీపంలోని సర్వే నంబర్: 601, 602లలో రహదారికి అడ్డంగా నిర్మాణం చేసిన ప్రహరీని బుధవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేశారు. రోడ్డు స్థలంలో ఉన్న గోడపై స్థానికులు ఫిర్యాదులు రావడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. తమ సొంత పట్టాభూమిలో వేసుకున్న ప్రహరీని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హైడ్రా కూల్చివేసినట్లు స్థానికులు ఆరోపించారు.

ప్రజాసంక్షేమం బీజేపీతోనే సాధ్యం

మణికొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు టి.అంజన్‌కుమార్ పేర్కొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ శాఖ అధ్యక్షుడు మెండే నాగేష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ మంచిరేవుల కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు భిక్షపతి, ప్రభాకర్, అనిల్‌కుమార్, శివరాజ్, అరవింద్, జైదీప్, జైపాల్‌రెడ్డి, వెంకటేష్, రవియాదవ్, చెన్నయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ, ఎన్‌టీఆర్ నగర్‌లోని షిర్డీ సాయిబాబా దేవాలయ 4వ వార్షికోత్సవం గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు లక్ష్మీగణపతి, వాస్తు, నవగ్రహాల హోమాలు, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్న సమారాధన, శుక్రవారం తెల్లవారుజామున 5.30 నుంచి 7 గంటల వరకు పాలాభిషేకం, అనంతరం సాయిబాబా వారి దివ్య అలంకరణ, ఉదయం 11.45 గంటలకు ప్రత్యేక కోవాతో కేక్ సమర్పించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నసమారాధన, సాయంత్రం 6 గంటలకు సంధ్యాహారతి, సాయంత్రం 6.30 గంటలకు పురవీధుల్లో పల్లకీ సేవా ఉంటుందని తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఏ సభ్యుల ప్రయోజనాలను కాపాడాలి

మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కోరిన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే గాంధీ, ఆర్‌డబ్ల్యూ సభ్యులు

గచ్చిబౌలి: రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సభ్యుల ప్రయోజనాలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఫెడరేషన్ ఆఫ్ గేటెడ్ కమ్యూనిటీస్ సైబరాబాద్–ఎఫ్‌జీసీసీ అసోసియేషన్ సభ్యులతో కలిసి నగరంలోని మంత్రులు నివాస ప్రాంగణంలో మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. తెలంగాణ సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్–2001 ప్రకారం నమోదు చేయబడిని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (ఆర్‌డబ్ల్యూఏలు) చట్టపరమైన స్థితిని సమర్థించడం, వేలాది మంది ఆర్‌డబ్ల్యూలకు ప్రయోజనం చేకూర్చడం వంటి అంశాలను మంత్రికి వివరించారు. టీఎస్ఆర్ఏ–2001 కింద నమోదైన ఫెడరేషన్ ఆఫ్ గేటెడ్ కమ్యూనిటీలు ఈ ఫెడరేషన్‌లో సభ్యులుగా ఉన్నారని, వీరిలో దాదాపు అందరూ తమ ఆర్‌డబ్ల్యూలను టీఎస్ఆర్ఏ–2001 కింద నమోదు చేసుకున్నారని వివరించారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే గాంధీ వివరించారు. నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కావూరి అనిల్, ఎఫ్‌జీసీసీ అసోసియేషన్ సభ్యులు సాయిరవిశంకర్, మాగంటి సత్యనారాయణ, హరిప్రసాద్, శివప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో రెండు గుడిసెలు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

శేరిలింగంపల్లి: చిన్నారులు అగ్గిపెట్టె పుల్లలతో ఆడుకుంటూ నిప్పు పెట్టడంతో రెండు గుడిసెలు అగ్నికి ఆహుతైన సంఘటన శేరిలింగంపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం సమయంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫారం 6వ వైపు ఫుట్‌పాత్‌పై ఉన్న రెండు గుడిసెలకు నిప్పు అంటుకుంది. స్థానిక గుడిసెల్లో నివాసం ఉండే చిన్నారులు అగ్గి పుల్లలతో ఆడుకుంటుండగా నిప్పు పేపర్లకు అంటుకొని సమీపంలోని రెండు గుడిసెలకు అంటుకోవడంతో పూర్తిగా దగ్ధం అయ్యాయి. వట్టినాగులపల్లి ఫైర్‌స్టేషన్ నుంచి ఫైర్ ఇంజన్‌తో వచ్చిన సిబ్బంది మంటలను ఆర్పినా ప్రయోజనం లేకపోయింది. ఆ సమయంలో గుడిసెల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. గుడిసె దగ్ధం కావడంతో సర్వం కోల్పోయామని బాధితురాలు కనకదుర్గ వాపోయారు.

వర్గీకరణపై చిత్తశుద్ధితో ప్రభుత్వం



కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

శేరిలింగంపల్లి: ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. బుధవారం శేరిలింగంపల్లి నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించినందుకు డప్పులు కొట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ... సమాజంలో అన్ని వర్గాలకు మేలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు రాములుగౌడ్, బాలింగ్ యాదగిరిగౌడ్, వీరేందర్‌గౌడ్, శేఖర్ ముదిరాజ్, నరేందర్‌గౌడ్, సాంబశివరావు, ఉరిటి వెంకట్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నష్టదాయకంగా కేంద్ర బడ్జెట్

ఎంసీపీఐయూ గ్రేటర్ కార్యదర్శి దానయ్య



ఎంఏనగర్ కూడలిలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

మియాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక వర్గంతోపాటు అన్ని వర్గాల ప్రజలకు నష్టదాయకంగా ఉందని ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కర్ర దానయ్య అన్నారు. ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా మియాపూర్ ఎంఏనగర్ కూడలిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్ ప్రైవేటీకరణకు ఊతమిచ్చేలా... విదేశీ కంపెనీలకు లబ్ధికల్పించేదిగా ఉందన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు మైదంశెట్టి రమేష్, మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాండ్ర కళావతి, నాయకులు దశరథ్ నాయక్, శివాణీ, నారాయణ, రాజు, దేవేందర్, రాజు, రాములు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని షెడ్లను తొలగించండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ నుంచి కిష్టారెడ్డి పేటకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి నాలా కన్వర్షన్ లేకుండా వ్యవసాయ భూముల్లో భారీ షెడ్లు నిర్మించి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ నాయకులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూముల్లో భారీ షెడ్లు నిర్మాణం చేసి వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లు, క్రీడా ప్రాంగణాలు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. వీరి నుంచి ప్రభుత్వానికి రూపాయి ఆదాయం లేదు.. కానీ వాళ్లు మాత్రం లక్షల్లో ఆదాయాలు పొందుతున్నారని మండిపడ్డారు. నాలా కన్వర్షన్ కోసం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించకుండా.. మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, రూపాయి పన్ను చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. సామాన్యులు చిన్న గుడిసె వేసుకుంటే అనుమతి లేదని కూల్చివేసే అధికారులు భారీ షెడ్లు వేసి వ్యాపారాలు చేస్తుంటే ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. అనుమతి లేకుండా నిర్మించిన షెడ్లను వెంటనే కూల్చివేయాలని, వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరాస్వామి, జిలాని, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు



వర్రకుంటను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వర్రకుంట ఆక్రమణలపై చెన్నైయ్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో గతంలో స్థానికులు పిటీషన్ దాఖలు చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఆర్డీఓ రవీందర్ రెడ్డిలు వర్రకుంట ప్రాంతాన్ని పరిశీలించారు. రికార్డుల పరంగా కుంట భౌతికంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి కుంటను గుర్తించాలని ఆదేశించారు. ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి రికార్డులను పరిశీలించారు.